క్లుప్తంగా

ఎంసెట్ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు ఎంసెట్ మెటీరియల్ అందజేస్తున్న సూర్యారావు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎంసెట్ మెటీరియల్ పుస్తకాలను ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకుడు దొడ్డి సూర్యారావు మంగళవారం అందజేశారు. దాతను కళాశాల ప్రిన్సిపాల్ పి.కృష్ణమూర్తి, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న నాయకులు

చీపురుపల్లి: స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలో 41మంది లబ్ధిదారులకు పంచాయతీ కార్యాలయం వద్ద మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, పార్టీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పార్టీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ మాట్లాడుతూ పేదల సొంతింటి కల సాకారం చేయడమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు మంజూరు చేస్తున్నారని చెప్పారు. నాయకులు కొసిరెడ్డి రమణ, ముల్లు పైడిరాజు, ఇప్పిలి తిరుమల, మల్లెంపూడి శ్రీను, మీసాల రామారావు, అంబటి లోకేష్ పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, తదితరులు

దత్తిరాజేరు: ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం-2024 డైరీని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు ఆసంఘం నియోజకవర్గ నాయకుడు జి.నాగేశ్వరరావుతో కలిసి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఉద్యోగులు సహకారం వల్లే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తు న్న సంక్షేమ పథకాల ఫలాలు లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నాయని అన్నారు. వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, పలు గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పరదేశమ్మ తీర్థం



అమ్మవారి ఆలయం వద్ద భక్తుల సందడి

వేపాడ: మండలంలోని వావిలపాడులో గ్రామ దేవత పరదేశమ్మ తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం ఆకట్టుకుంది. జిల్లాస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు బుధవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చెప్పారు.

లెప్రసీ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న సచివాలయ, వైద్య సిబ్బంది

దత్తిరాజేరు: లెప్రసీ(కుష్టు) రహిత సమాజాన్ని నిర్మిద్దాం అని కె.కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి స్రవంతి పిలుపునిచ్చారు. లెప్రసీ డే సందర్భంగా మరడాం గ్రామంలో సచివాలయ,వైద్య సిబ్బందితో కలిసి మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. శర్మంపై స్పర్శ లేని రాగి రంగులో మచ్చలు ఉంటే వెంటనే సమీప పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధిని సకాలంలో గుర్తించి మందులు వాడితే నయమవుతుందన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ గిరిబాబు, సీహెచ్‌ఓ జయరాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది గేట్ మీటింగ్

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ డిపోలో ఏపీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఆ యూనిట్ జోనల్ ఉపాధ్యక్షుడు జి.ఎస్.రాజు, జిల్లా అధ్యక్షుడు జి.విరమణ మాట్లాడుతూ విశాఖ డీపీటీఓ ఏకపక్ష నిర్ణయాలతో దీర్ఘకాలికంగా సిబ్బందిలో ఉన్న ఆందోళనతో పాటు సంస్థకు కలుగుతున్న నష్టాన్ని వివరించారు. పలు సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి అసోసియేషన్ పోరాటం చేస్తుందని చెప్పారు. డిపో గ్యారెజీ కార్యదర్శి కె.ఆనంద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం

- మహిళా సాధికారతకు సీఎం జగన్ పెద్దపీట వేశారు
- పార్టీలకతీతంగా ప్రతీ కుటుంబానికి మేలు చేశాం
- టీడీపీ, ఎల్లోమీడియా దుష్ప్రచారాన్ని నమ్మకండి
- ఎన్నికలు వచ్చినప్పుడే టీడీపీ నాయకులకు ప్రజలు గుర్తొస్తారు
- వైఎస్సార్ ఆసరా సంబరాల్లో మంత్రి బొత్స సత్యనారాయణ



మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ



సంబరాల్లో పాల్గొన్న మహిళలు

గుర్ల: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా, చేయూత తదితర పథకాలను అమలు చేస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఎంపీపీ పొట్నూరు ప్రమీల అధ్యక్షతన మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన మండలస్థాయి వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలకు మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో అధిక శాతం మహిళలకే వర్తించేలా చూస్తూ మహిళా సాధికారతకు సీఎం జగన్ పెద్దపీట వేశారన్నారు. 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా సం ఘాలకు రుణమాఫీ చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత రుణమాఫీ చేయకుండా మోసం చేశారని గుర్తు చేశా రు. 2019 ఏప్రిల్ నాటికి రాష్ట్రంలో డ్వాక్రా సంఘాలకు బ్యాంకుల్లో ఉన్న అప్పును నాలుగు విడతల్లో చెల్లిస్తామని 2019 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, మాటప్రకారం వైఎస్సార్ ఆసరా పేరుతో ఇప్పటికే మూడు విడతల్లో మహిళల ఖాతాల్లో డబ్బులు జమచేశామని, ప్రస్తుతం నాలుగో విడత నిధులు జమచేశామని చెప్పా రు. ఆసరా నాలుగో విడతలో భాగంగా మండలంలోని 13,707 మంది డ్వాక్రా సంఘాల సభ్యుల ఖాతాల్లో రూ.8.76 కోట్లు జమచేశామన్నారు. జిల్లాలో జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా పిల్లలను బడులకు పంపించే తల్లుల ఖాతాల్లో ప్రతీ ఏడాది రూ.135 కోట్లు జమ చేస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద జిల్లా లోని డ్వాక్రా సంఘాల సభ్యులకు రూ.120 కోట్లు అందజే శామని వివరించారు. పేద పిల్లలు కూడా ఇంగ్లిష్ మీడి యంలో చదువుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠ శాలల్లో ఇంగ్లిష్ మీడియం అమలు చేస్తున్నామని, నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశామని చెప్పారు.

ధైర్యంగా ఓటు అడగగలుగుతున్నాం..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా ప్రతీ కుటుంబానికి మేలు జరిగిందని, అందుకే మీకు మంచి జరిగితేనే ఓటు వేయండని సీఎం జగన్ మోహన్‌రెడ్డి, తాము ధైర్యంగా ఓటు అడగగలుగుతున్నామని మంత్రి బొత్స అన్నారు. సీఎం జగన్ రూపొందించి అమలు చేసిన పథకాల వల్ల పేదల జీవనప్రమాణాలు మెరుగుపడ్డాయని చెప్పారు. ఆరోగ్య శ్రీ ద్వారా పేదలు వైద్యం చేయించుకునేందుకు గతంలో ఉన్న రూ.5 లక్షల వ్యయపరిమితిని రూ.25 లక్షలకు పెంచామని తెలిపారు. సంక్షేమం, అభివృ ద్ధి కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా కొనసాగాలన్నారు.ఎన్నికలు వస్తేనే టీడీపీ నాయకులు గ్రామాల్లో కనబడతారని, తర్వాత ప్రజలను పట్టించుకోరని మంత్రి బొత్స అన్నారు. టీడీపీ నాయకుల మోసపూరిత హామీలను, ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని నమ్మవద్దని మహిళలకు సూచించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏం అభివృద్ధి చేశారని, పేదలకు సంక్షేమ పథ కాలు ఎందుకు అందించలేదో చెప్పాలని గ్రామాల్లోకి వచ్చే ఆ పార్టీ నాయకులను నిలదీయాలని సూచించారు.

హామీలన్నీ నెరవేర్చాం



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం జగన్ నేరవర్చారని అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మండలంలో 3 వేల పేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేశామని, ఇంకా ఎవరికైనా ఇళ్లు కావాలంటే మంజూరు చేస్తామనిచెప్పారు. ఉత్తారంధ్ర సుజల స్రవంతి ద్వారా మండలంలోని చివరి ఎకరానికి సాగు నీరు అందిస్తామన్నారు. జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, ఆర్డీఓ శాంతికుమారి, ఎంపీడీఓ కల్యాణి, తహసీల్దార్ పద్మావతి, ఏపీఎం నారాయణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసి నాయుడు, డీసీసీబీ చైర్మన్ చిన్న రామునాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు పాల్గొన్నారు.

రూ.4.50 లక్షలు జమయ్యాయి..



ఎన్నికల్లో ఇచ్చిన మాటకు అనుగుణంగా డ్వాక్రా సంఘాలను సీఎం జగన్ ఆదుకున్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మా సంఘానికి నాలుగు విడతల్లో రూ.4.50 లక్షలను ప్రభుత్వం అందజేసింది. వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు తదితర పథకాల ద్వారా మహిళలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోంది.

– రఘుమండ సత్యవతి, గూడెం గ్రామం

అండగా నిలిచారు..



మా సంఘానికి వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా నాలుగు విడతల్లో రూ.2.80 లక్షలు ప్రభుత్వం జమ చేసింది. అలాగే సున్నా వడ్డీ రాయితీ వర్తించింది. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

– లండ రాములమ్మ, గుజ్జింగివలస

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. ఆసరా పథకంలో భాగంగా నాలుగు విడతల్లో నాకు రూ.40 వేలు అందింది. నగదు వీటితో పాటు రైతు భరోసా పథకం, అమ్మఒడి పథకం వర్తించాయి.

–తోట గౌరి, గూడెం గ్రామం

జగనన్న ఆరోగ్య సురక్ష..పేదలకు రక్ష



వృద్ధులకు కళ్లద్దాలు అందజేస్తున్న నాయకులు రమణరాజు, వేణుగోపాలరావు

మెరకముడిదాం: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తోందని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్. వి.రమణరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు తాడ్డి వేణుగోపాలరావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష -2లో భాగంగా సోమలింగాపురం పంచాయతీ మధుర గ్రా మం గోపన్నవలసలో మంగళవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించారు. శిబిరంలో 348 మందికి వైద్యాధికారులు వివిధ పరీక్షలు చేసి, అవసర మైన వారికి ఉచితంగా మందుల కిట్‌లు పంపిణీ చేశారు. అలాగే ఇటీవల నేత్ర శస్త్రచికిత్సలు చేయించుకున్న వృద్ధులకు కళ్ల ద్దాలు అందజేశారు. ఆర్ఈసీఎస్ మా జీ చైర్మన్ ఎస్.కృష్ణమూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆసరా సంబరాలకు స్థల పరిశీలన



స్థలపరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, అధికారులు, నాయకులు

బొండపల్లి: మండలస్థాయి ఆసరా నాలుగో విడత సంబరాలను ఫిబ్రవరి-4వ తేదీన నిర్వహించనున్నారు. సంబరాలను స్థానిక భువి లేఅవుట్ లో నిర్వహించేందుకు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మంగళవారం స్థలపరిశీలన చేశారు. వేదిక ఎక్కడ ఏర్పాటు చేయాలి, సభకు వచ్చే డ్వాక్రా మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులు, నాయకులు సూచనలు చేశారు. సంబరాలకు పదివేల మందికిపైగానే మహిళలు వచ్చే అవకాశం ఉందని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ఎంపీపీ చల్లా చలం నాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.వి.ప్రభూజీరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, ఎంపీడీఓ వై.వి.రాజేంద్ర ప్రసాద్, వెలుగు ఏపీఎం కె.సులోచనాదేవి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు బోడసింగి జగదీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్ బృందం ఆడిట్ పూర్తి చేసింది. ఈ నివేదికలపై స్థానిక మండల పరిషత్ కార్యాల య ఆవరణలో ఉపాధిహామీ ఏపీడీ జి.ఉమాపరమేశ్వరి, అంబుడ్స్‌మెన్ అన్నపూర్ణాదేవి, విజిలెన్స్ అధికారులు వెంకటరావు,ఎస్.అచ్యుతరావు ఆధ్వర్యంలో మంగళవారం ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో పంచాయతీల వారీగా చేసిన పనులు, నిధుల ఖర్చు, పనులకు హాజరైన వేతనదారుల వివరాలను ఆడిట్ బృందం సభలో చదివివినిపించింది. ఉపాధిహామీ ఏపీఓ కనకరాజు,సిబ్బంది, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు,వైస్ ఎంపీపీ జి.శ్రీరాముల నాయుడు, పలుగ్రామాల సర్పంచులు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు గజపతినగరంలో ఆసరా సంబరాలు

గజపతినగరం: మండలస్థాయి వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు స్థానిక బైపాస్ రోడ్డు వద్ద బుధవారం నిర్వ హించనున్నట్లు ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని డ్వాక్రా సంఘాల సభ్యులు, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



మహిళల విభాగంలో నియోజకవర్గస్థాయి విజేతలతో ఎమ్మెల్యే అప్పలనరసయ్య

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: చదువుతో పాటు క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. క్రికెట్,వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మిం టన్ క్రీడల్లో మహిళలు, పురుషులకు నిర్వహించిన నియోజకవర్గస్థాయి 'ఆడుదాం-ఆంధ్రా' పోటీలు మంగళవారంతో ముగిసాయి. విజేతలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళా శాల మైదానంలో ఎమ్మెల్యే ట్రోఫీలు, మెమెంటోలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రీడాప్రతిభను వెలికి తీసేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం-ఆంధ్రా' పేరిట రాష్ట్ర వ్యాప్త టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, ఏఎంసీ చైర్మన్ వి.ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డి పద్మావతి, మండల సురేష్, బెల్లాన త్రినాథరావు, రేగ సురేష్, సామంతుల పైడిరాజు, ఎంపీడీఓ కిశోర్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు ఎల్.కోటలో ఆసరా సంబరాలు

లక్కవరపుకోట: మండలంలోని అరకు-విశాఖ రోడ్డులో సంతపేట జంక్షన్ వద్ద సాంభవి లేఅవుట్‌లో మండలస్థాయి వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు బుధవారం నిర్వహించనున్నట్లు వెలుగు ఏపీఎం అప్పలనాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అతిథిగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరవుతార ని, మండలంలోని డ్వాక్రా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

రామాలయ నిర్మాణానికి టీటీడీ సాయం

దత్తిరాజేరు: మండలంలోని దాసుపేట గ్రామంలో రామాలయం పునర్నిర్మాణానికి టీటీడీ(తిరుమల తిరుపతి దేవస్థానం) రూ.10 లక్షలు మంజూరు చేసింది. మొదట విడత గా రూ.3.33 లక్షలు టీటీడీ విడుదల చేసిందని సర్పంచ్ ప్రతినిధి సిరిపురపు శంకరరావు మంగళవారం తెలిపారు. గ్రామంలోని రామాలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో ఆలయాన్ని పునర్నిర్మించేందుకు గ్రామస్తులు నిర్ణయం తీసుకున్నారు. ఆలయ నిర్మాణానికి టీటీడీ నుంచి ఆర్థికసాయం అందేలా చూడాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ను కోరారు. టీటీడీ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి రూ.10 లక్షలు మంజూరు చేయించారని సర్పంచ్ ప్రతినిధి శంకరరావు తెలిపారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులాహ్వానం

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో 5వతరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీలకు 70 సీట్లు, ఎస్టీలకు 5, బీసీలకు 4, ఓసీలకు 1 సీటు కేటాయించామని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు గుర్తింపు పొందిన పాఠశాలలో 2022-23 విద్యాసంవత్సరంలో 3వ తరగతి, 2023-24లో నాలుగో తరగతి చదివి ఉండాలని, తల్లిదం డ్రుల ఆదాయం ఏడాదికి లక్ష రూపాయలకు మించి ఉండకూడదని వివరించారు. విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్//ఏపీడీఆర్ఏజీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో ఫిబ్రవరి 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష మార్చి 10న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు పాఠశాల పని వేళల్లో సంప్రదించాలని సూచించారు.

కూరగాయల సాగుతో నిరంతరఆదాయం



కూరగాయల సాగును పరిశీలిస్తున్న అధికారులు

కొత్తవలస: ఏటీఎం మోడల్‌లో ఏడాదంతా ఆకుకూరలు, కూరగాయల పంటలను సాగు చేయడం వల్ల నిత్యం ఆదాయం పొంద వచ్చని ప్రకృతి వ్యవసాయ రీజినల్ కో-ఆర్డినేటర్ హేమసుందర్ అన్నారు. మండలంలోని దెందేరు గ్రామానికి చెందిన విరోతి ఎర్ర య్యమ్మ సుమారు 10 సెంట్ల విస్తీర్ణంలో సేంద్రియ విధానంలో సాగు చేస్తున్న ఆకు కూరలు,దుంప,తీగ జాతుల కూరగాయల పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. సేంద్రియ విధానంలో సాగు చేసిన పంటలను ఆహారంగా తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఏపీఎంలు వెంకటరమణ,హేమ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశయాలు ఆదర్శం



కొత్తవలస: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసమిశ్ర,ఉద్యోగులు

జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన చూపిన మార్గంలో నడుచుకోవాలని అధికారులు, పలు సంఘాలు, పార్టీ నాయకులు అన్నారు. గాంధీ వర్ధంతిని ఎస్.కోట, కొత్తవలస, జామి, గరివిడి, గజపతినగరం మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

– శృంగవరపుకోట/కొత్తవలస/జామి/చీపురుపల్లి రూరల్(గరివిడి)/గజపతినగరం



గజపతినగరం: గజపతినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ, విద్యార్థులు



శృంగవరపుకోట: ఎస్.కోటలో గాంధీ విగ్రహనికి పూలమాలలు వేస్తున్న ఆర్యవైశ్యసంఘం నేతలు



శృంగవరపుకోట: ఎస్.కోటలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాపూజీ యువజన సంఘం సభ్యులు



చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడిలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు



జామి: జామిలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఆర్యవైశ్యసంఘం నేతలు



కొత్తవలస: రామలింగాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు